RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి : 3, సంచిక : 283

బుధవారం
అక్టోబర్ 15, 2025

పేజీలు : 4
వెల : రూ.3-00



పెన్షన్ కోసం క్యూలో నిలిచిన గౌరవం

3లో..

- పేదింటి ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం
- కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ
- రూ.5.30 కోట్ల చెక్కులు.. 530 మందికి ఆర్థిక సాయం
- మహిళల కోసం ఉచిత సేవలు, విద్యుత్ రాయితీలు
- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ



## అభివృద్ధి దిశగా...
# వరంగల్ తూర్పు

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ పేదింటి ఆడపడుచుల పాలిట వరమని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గ్రేటర్ వరంగల్ శివనగర్ లోని సాయి కన్వెన్షన్ హాల్ లో మంగళవారం వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధి లోని వరంగల్ , ఖిలావరంగల్ మండలాలకు చెందిన 530 మంది లబ్ధిదారులకు 5 కోట్ల 30 లక్షల 61 వేల 480 రూపాయల కళ్యాణ లక్ష్మీ, షాది ముభారక్ చెక్కులను, 103 మందికి 35 లక్షల 37 వేల 700 రూపాయల చీఫ్ మినిస్టర్ రిలీఫ్ చెక్కులు, లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ధ్రువ పత్రాలను సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆడపిల్ల పెళ్లిలకు మేమున్నామని భరోసా ఇస్తూ ప్రభుత్వం పేదింటి అడబిడ్డల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.అందరికీ సమాన న్యాయం చేయడం, నిరుపేదల కుటుంబాలు వెలుగులు నింపడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ముందుకు పోతున్నదని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, సంక్షేమం అభివృద్ధిపై దృష్టి సారించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని అన్నారు. ప్రతి ఇంటికి ఇల్లాలే వెలుగని, మహిళ లక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రూ.10 లక్షలకు ఆరోగ్య శ్రీ పెంపు, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, పేదల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందుతున్నాయన్నారు. ఉచిత బస్సు సౌకర్యం ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఉగాది నుండి సన్న బియ్యం పథకాన్ని దేశంలో ఎక్కడా లేనివిధంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. అర్హులైన వారికి నూతన రేషన్ కార్డులు అందజేస్తున్నామని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, అర్హులు అధైర్య పడాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు. రైతుల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ ఉచిత విద్యుత్, సాగునీరు, పెట్టుబడి సహాయం, మద్దతు ధర వంటి వాటిని ప్రవేశపెట్టి రైతులకు ఇబ్బంది లేకుండా ప్రజా ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. వరంగల్ తూర్పు నియోజకవర్గ సంపూర్ణ అభివృద్ధి ధ్యేయంగా ముందుకెళుతున్నట్లు తెలిపారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికే 4వేల పైగా లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని, అర్హత గల వారు దరకాస్తు చేసుకోవాలన్నారు.

ప్రతి నియోజకవర్గంకు ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం ప్రభుత్వం 200 కోట్లను నిధులు కేటాయించిందని, త్వరలోనే వరంగల్ తూర్పు లో భూమి పూజ చేస్తామన్నారు. త్వరలోనే సమీకృత వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంను ప్రారంభోత్సవం చేస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సోమిశెట్టి ప్రవీణ్, ఉమా దామోదర్, పోశాల పద్మ, చింతాకుల అనిల్, భోగి సువర్ణ, కావేటి కవిత, పల్లం పద్మ, గుండు పూర్ణ చందన,డిఆర్ ఓ విజయలక్ష్మి, ఉప కమిషనర్ ప్రసన్నారాణి, తహశీల్దార్లు శ్రీకాంత్, ఇక్బాల్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన ఫీజులను వెంటనే తగ్గించాలి



**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

స్వేరో స్టూడెంట్స్ యూనియన్ (ఎస్ఎస్ యూ) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలోస్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఎల్తూరి సాయికుమార్ మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ విద్యార్థులకు పాత పద్ధతిలోనే ఫీజులు రిజిస్ట్రేషన్ కు 80 రూపాయలు ఇతరాంతర యూనివర్సిటీ ఫీజులాంటు 1300 రూపాయలు తీసుకోవడం జరిగింది అదేవిధంగా ఇప్పుడు కూడా ఫీజులు వసూలు చేయాలని హెచ్చరించారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో పేద బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువును అభ్యసిస్తారు కావున వారికి అంత పెద్ద మొత్తమున యూనివర్సిటీ పెంచిన 3250 ఫీజులు కట్టలేని కుటుంబాలు కావున తక్షణమే యూనివర్సిటీ ఫీజులు తగ్గించాలని పెద్ద ఎత్తున విద్యార్థులతో కలిసి డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున యూనివర్సిటీ పరిపాలన భవనం ముట్టడిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు చెట్టుపల్లి శివకుమార్ ,కార్యదర్శి ఉల్లే రావుబాన్ని, కాకతీయ డిగ్రీ కాలేజ్ రాజ్ కుమార్, నాగరాజు ,కార్తీక్, శ్రీరామ్, చరణ్, మహేష్ ,పవన్ ,సునీల్, శ్రావణ్, యశ్వంత్ ,గణేష్, శ్రీనాథ్, కీర్తన , లయకరి, ఝాన్సీ,నవ్య ,శృతి, యశ్వంతి ,శాలిని, రవళి, బిందు, తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు
# వేడెక్కుతున్న వాతావరణం

- బీఆర్ఎస్ నుంచి మాగంటి సునీత బరిలో
- కేసీఆర్ చేతుల మీదుగా బీ ఫామ్, చెక్కు అందజేత
- కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్ పోటీ సమాయత్తం
- బీజేపీ అభ్యర్థి ప్రకటన ఇంకా నిలిపివేత

**వేద న్యూస్ డెస్క్:**



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల రాజకీయ వేడి క్రమంగా పెరుగుతోంది. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా పార్టీ అభ్యర్థి మాగంటి సునీతకు బీ ఫామ్ అందజేశారు. పార్టీ తరఫున ఎన్నికల నిర్వహణ, ప్రచార వ్యయం కోసం రూ. 40 లక్షల చెక్కును ప్రత్యక్షంగా అందించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు మహిళా శక్తి, స్థానిక అభ్యర్థులపై నమ్మకం వంటి అంశాలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో మాగంటి సునీతతో పాటు ఆమె కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, పద్మారావు గౌడ్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్ వంటి కీలక నేతలు హాజరై అభ్యర్థికి మద్దతు పలికారు. పార్టీ శ్రేణుల్లో ఉత్సాహ వాతావరణం నెలకొంది. ఇక కాంగ్రెస్ పార్టీలోనూ సమీకరణలు వేగంగా జరిగాయి. నవీన్ యాదవ్‌ను అభ్యర్థిగా

మిగతా 3వ పేజీలో..

## గురుకుల నిధులపై
# హరీశ్‌రావు ప్రశ్నలు



- గ్రీన్ ఛానెల్ హామీ కేవలం మాటలేనా
- పెండింగ్ బిల్లులతో చితికిపోతున్న గురుకులాలు
- విద్యార్థుల నిరసనలు ప్రభుత్వ వైఫల్య సూచన

**వేద న్యూస్ డెస్క్:**

మాజీ మంత్రి హరీశ్‌రావు గురుకుల విద్యాసంస్థలకు నిధుల కేటాయింపులపై ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తామన్న వాగ్దానం కేవలం మాటలకే పరిమితమైందా? అని ప్రశ్నించారు. గురుకులాల్లో చదువుతున్న లక్షలాది బిడ్డల భవిష్యత్తు పై ప్రభుత్వానికి నిజమైన కర్తవ్యబోధ ఉందా? అని నిలదీశారు. రాష్ట్రంలో 1024 గురుకులాలకు కేవలం రూ.60 కోట్లు కేటాయించడం అవమానకరమని వ్యాఖ్యానించారు. వేల కోట్ల ప్రాజెక్టుల పేరుతో ప్రచారం చేస్తూ, విద్యార్థుల కోసం కనీస నిధులు కేటాయించడం కూడా ప్రభుత్వం తప్పించుకుంటుందా? అని ప్రశ్నించారు. గురుకులాల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తు మీద ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందని అన్నారు. గురుకులాల్లో మోటార్ల మరమ్మతులు, భవన అద్దెలు, మెస్ చార్జీలు, కాస్మొటిక్, స్టిచ్చింగ్ ఛార్జీలు వంటి మౌలిక అవసరాలూ నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లుల కారణంగా కాంట్రాక్టర్లు నష్టపోతున్నారని, తాత్కాలిక సిబ్బంది వేతనాల కోసం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

గురుకులాల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ విద్యార్థులు నిరసనలకు దిగడం

మిగతా 2వ పేజీలో..



## బూత్ స్థాయి సమన్వయం
# ప్రారంభం

- ప్రచారం ఇంటింటికీ చేర్చే పిలుపు
- ప్రతి కార్యకర్త ఒక నాయకుడిలా పనిచేయాలి
- యువత, మహిళల పాత్ర కీలకం
- కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి సమగ్ర వ్యూహం

**వేద న్యూస్ డెస్క్:**

జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని బోరబండలో కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీ సమావేశం ఉత్సాహంగా జరిగింది. ఏఐసిసి సెక్రటరీ విశ్వనాథన్, పార్టీ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రి సీతక్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ప్రత్యేకంగా హాజరయ్యారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ప్రాంతీయ నాయకులు విస్తృతంగా హాజరయ్యారు. భారీగా హాజరైన బూత్ కమిటీ ప్రతినిధులను ఉద్దేశించి నేతలు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ప్రతి బూత్‌ను పార్టీ శక్తి కేంద్రంగా మార్చాలని,

మిగతా 3వ పేజీలో..



## ములుగు ప్రాజెక్టులపై వేగవంత
# చర్యలకు ఆదేశాలు

- ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టమైన సూచనలు

**వేద న్యూస్ డెస్క్:**




సచివాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిపై ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ములుగు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి సీతక్క ప్రత్యేకంగా హాజరయ్యారు. ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిపై సమగ్ర చర్చ జరిగింది. ములుగు జిల్లాలో సాగునీటి సదుపాయాలను మెరుగుపరచడంపై మంత్రి సీతక్క ప్రత్యేకంగా దృష్టి సారించారు. రైతులకు నీటి అందుబాటు సక్రమంగా ఉండేలా పెండింగ్ లో ఉన్న పనులను

మిగతా 3వ పేజీలో..

వేద న్యూస్

బుధవారం అక్టోబర్ 15, 2025

# పిజీ కళాశాలను సందర్శించిన వీసీ




**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి ఖమ్మంలోని (యూపిజీసి) యూనివర్సిటీ పీజీ కాలేజీని నేడు సందర్శించారు. వారు కాలేజీ ప్రాంగణంలో ఉండే వసతులు, గ్రంథాలయం, తరగతి గదులు, వ్యాయామ కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలేజీలోని బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, వసతులు, వనరుల వివరాలను ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ రవి కుమార్ ను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కుమార్ సిబ్బందిని వైస్ చాన్సలర్ కు పరిచయం చేసి, కాలేజీ కార్యకలాపాలపై వివరాలు అందించారు.

# గురుకుల నిధులపై హరీశ్‌రావు ప్రశ్నలు

ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని చెప్పారు. బడులు పట్టాల్సిన పిల్లలు రోడ్లపై సమస్యలు చెప్పుకోవాల్సిన పరిస్థితి రావడం దుర్ఘటనగా అభివర్ణించారు. సమీక్షలు నిర్వహించడం కాదు, సమస్యలకు పరిష్కారం చూపేందుకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రీన్ ఛానెల్ పేరుతో ప్రకటించిన నిధుల విడుదల ఇంకా అమలులోకి రాలేదని గుర్తుచేశారు. ఫోటోలు, ప్రచారాలతో కాకుండా వాస్తవ సమస్యలపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. గురుకులాల గౌరవం, నాణ్యత కాపాడాలంటే వెంటనే చర్యలు అవసరమని స్పష్టం చేశారు.

గురుకులాల్లో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వం తక్షణ స్పందనతో పూర్తి స్థాయి నిధులు విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు రాజకీయ ప్రయోజనాలకోసం నిలిపివేయరాదని, విద్యా రంగం పట్ల ప్రభుత్వం బాధ్యతతో వ్యవహరించాల్సిన సమయం ఇదేనని హెచ్చరించారు.

# ఐపీఎస్ అధికారి వై.పూరన్ కుమార్ విషాదం

## - రాహుల్ గాంధీ న్యాయం కోసం డిమాండ్



డెస్క్ : ఐపీఎస్ అధికారి వై. పూరన్ కుమార్ ఆత్మహత్య దేశ మనసును కదిలించిన విషాద ఘటనగా నిలిచింది. ఒక వారంగా ఆయన భార్య భర్తకు గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించేందుకు వేచి చూస్తుండటం హృదయాన్ని కలచివేస్తోంది. ఆమెతో పాటు పిల్లలు, ఈ బాధను అనుభవిస్తున్న దళిత సమాజం గుండెల్లో చోటుచేసుకున్న వేదనను ఊహించుకోవడం కూడా కష్టమేనని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై రోజులు గడుస్తున్నా, ఇప్పటికీ ఎలాంటి అరెస్టులు జరగకపోవడం స్పష్టమైన అన్యాయమని రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు. దళిత కుటుంబం న్యాయం కోసం ఎదురుచూస్తుంటే ప్రభుత్వ వ్యవస్థ మౌనంగా ఉండటం దారుణమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రం, హర్యాణా ప్రభుత్వాలు స్పందించకుండా ఉండటం హృదయరహితం అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. రాజ్యాంగం అందరికీ సమాన న్యాయం హామీ ఇస్తుందని చెప్పుకునే ప్రభుత్వం ఈ కుటుంబపు అరుపును ఎందుకు వినడం లేదని ఆయన నిలదీశారు. ప్రధాని నరేంద్ర మోదీ, హర్యాణా ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకుని బాధ్యులను శిక్షించి, ఈ దళిత కుటుంబానికి న్యాయం, గౌరవం కల్పించాలని రాహుల్ గాంధీ గట్టిగా డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "ఒక భార్య తన భర్తకు గౌరవప్రదంగా చివరి వీడ్కోలు చెప్పే హక్కు కోసం వారం రోజులుగా నిరీక్షించడం ఈ దేశ వ్యవస్థపై నమ్మకం కలిగిన ప్రతి పౌరుడిని కలవరపెడుతోంది," అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటన మన సమాజంలోని అనుసూత్రాలపై, ముఖ్యంగా దళితులపై జరుగుతున్న అన్యాయాలపై మరోసారి దృష్టిని సారించాలని ఆయన పిలుపునిచ్చారు. దళిత అధికారి మీద జరిగిన మానసిక హింస, అతన్ని ఆత్మహత్యకు దారి తీసిన పరిస్థితులు పూర్తిగా వెలుగులోకి రావాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఒక ఐపీఎస్ అధికారికి కూడా సురక్షిత వాతావరణం లేకుంటే, సాధారణ దళిత కుటుంబ స్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో న్యాయం ఆలస్యం అయితే అది న్యాయం కాదు అని స్పష్టం చేశారు.

ఈ ఘటన కేవలం ఒక కుటుంబం బాధ మాత్రమే కాకుండా, సామాజిక న్యాయం కోసం పోరాడే ప్రతి మనసుకు ఇది కఠిన పరీక్ష అని రాహుల్ గాంధీ అన్నారు. దేశాన్ని నడిపించేవారు కేవలం పదవుల్లో ఉండటం సరిపోదని, న్యాయాన్ని నిలబెట్టే బాధ్యతను నిర్వర్తించాల్సిన అవసరం ఉందని ఆయన హితవు పలికారు. ఇప్పుడు ప్రభుత్వం స్పందించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని అన్ని వర్గాలు సమైక్యంగా డిమాండ్ చేస్తున్నాయి.

# కెమికల్ ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం

### ప్రమాదానికి గల అసలు కారణంపై దర్యాప్తు ప్రారంభించిన అధికారులు

డెస్క్ : ఇండోర్: మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లోని ఒక కెమికల్ ప్రాసెసింగ్ ప్లాంట్‌లో మంగళవారం తెల్లవారుఝామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్లాంట్ పరిసరాల్లో అకస్మాత్తుగా మంటలు ఎగసిపడటంతో దట్టమైన పొగ వ్యాపించింది. అక్కడి కార్మికులు, స్థానికులు ఆందోళన చెంది వెంటనే పోలీసులకు, ఫైరుసిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక దళం సత్వర చర్య తీసుకుని అనేక ఫైరింజన్‌లను వినియోగించి మంటలను అదుపులోకి తెచ్చింది. అగ్నికీలలు పెద్ద ఎత్తున ఎగిసిపడటంతో ప్లాంట్‌లోని పరికరాలు, నిల్వ ఉంచిన కెమికల్ పదార్థాలు కాలిపోయాయి. ప్రాణ నష్టం జరగకపోవడం ఊరట కలిగించిందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. షార్ట్ సర్క్యూట్ కారణమా, లేక కెమికల్ రియాక్షన్ వల్ల మంటలు చెలరేగాయా అన్న కోణంలో విచారణ కొనసాగిస్తున్నారు. ప్లాంట్‌లో భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా అన్న అంశంపై కూడా పరిశీలన జరుగుతోంది.

# ఐకేపీ సెంటర్ అక్రమాల కేసులో ఇద్దరు అరెస్టు

**వేద న్యూస్,శాయంపేట:**

ఐకెపి సెంటర్ అక్రమాలలో విషయంలో ఇద్దరు అరెస్టు చేసినట్లు శాయంపేట ఎస్సై జక్కుల పరమేశ్వర ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఈ సంవత్సరం రబీ పంట సీజన్ సమయంలో ఐకెపి సెంటర్ లలో జరిగిన అక్రమాల విషయంలో ఈనెల పదకొండు వ తేదీ శాయంపేట పోలీస్ స్టేషన్ లో నమోదు అయిన కేసు సిఆర్ నెంబర్ 196/2025 లోనీ నేరస్థులలో ఇద్దరు నేరస్తులు వాంకుడోత్ చరణ్ డాటా ఎంట్రీ ఆపరేటర్ కాట్రపల్లి గ్రామం ,అదే గ్రామానికి చెందిన కాట్రపల్లి క్లస్టర్ ఐకెపి సెంటర్ ఇంచార్జ్ అల్లే అనిత ను పరకాల ఏసీపి సతీష్ బాబు ,శాయంపేట సి.ఐ. పి. రంజిత్ రావు ఇద్దరిని అరెస్ట్ చేసి, ఐకెపి సెంటర్ లో ట్యాబ్ ఆపరేటర్ అయిన చరణ్ వద్ద నుండి రూ.20,000 నగదు, సెల్ ఫోన్ ను, కాట్రపల్లి ఐకెపి సెంటర్ ఇంచార్జ్ అనిత వద్ద ఐకెపి సెంటర్ కు




సంబంధించిన ట్యాబ్ ను, టోకెన్ షీట్ బుక్ , సెల్ ఫోన్ ను స్వాధీనం చేసుకొని, అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారని ఎస్సై తెలిపారు.

# రుణం పేరుతో భాగ్యనగరంలో మరో పెద్ద మోసం బహిర్గతం

- వాట్సాప్ లోన్ ఆఫర్‌తో లక్షల మోసం
- సెలబ్రిటీ డీపీతో నమ్మబలికిన కేటుగాళ్లు
- ముందస్తు ఫీజుల పేరుతో డబ్బు దోపిడీ
- సైబర్ పోలీసులు అప్రమత్తం చేసిన హెచ్చరిక



డెస్క్ : హైదరాబాద్ నగరంలో మరోసారి సైబర్ నేరగాళ్లు తమ మోసపూరిత ఆటతీరుతో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేశారు. బేగంపేటకు చెందిన 30ఏళ్ల వ్యక్తికి లోన్ ఇస్తామని నమ్మబలికిన కేటుగాళ్లు లక్షల్లో డబ్బు పీకేశారు. ప్రభుత్వ యంత్రాంగం వరుసగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా, ఈ తరహా కేసులు ఆగడం లేదు. ప్రతి కొత్త పద్ధతితో సైబర్ మోసగాళ్లు అమాయకులను వలలోకి దిస్తున్నారు. ఫౌండర్ సల్మాన్ ఖాన్ పేరుతో వాట్సాప్‌లో ప్రొఫైల్ పెట్టుకుని, రూ.50 లక్షల లోన్ ఇస్తామని ఒక వ్యక్తి బాధితుడిని సంప్రదించాడు. రుణ ప్రక్రియ కోసం ముందుగా రూ.10 లక్షలు ఫీజులు, టాక్స్ పేరిట చెల్లించాల్సి ఉంటుందని చెప్పాడు. దానికి నమ్మకం వచ్చిన బాధితుడు దశలవారీగా మొత్తం రూ.7.9 లక్షలు చెల్లించాడు. ఆ తర్వాత కాంటాక్ట్ నిలిపేయడంతో తాను మోసపోయానని గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటనపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం పూర్తి వివరాలు వెల్లడించింది. ఫేక్ ఎన్జీవోలు, తెలియని వ్యక్తుల ప్రలోభాలకు లోనవ్వొద్దని స్పష్టంగా హెచ్చరించింది. ముఖ్యంగా సెలబ్రిటీ డీపీలు, ఆకర్షణీయమైన ప్రొఫైల్‌లు పెట్టి చేసే కాల్స్‌ను ప్రజలు విశ్వసించవద్దని సూచించింది. అసలు లోన్ ప్రక్రియలో ముందస్తు డబ్బు చెల్లింపు అధికారికంగా ఉండదని పోలీసులు మరోసారి స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్లు మానసిక ఒత్తిడి, తక్షణ సహాయం అనే మోసపూరిత భావనను కలిగించి తక్షణ నిర్ణయాలు తీసుకునేలా చూస్తారని అధికారుల హెచ్చరిక. ధృవీకరించిన బ్యాంకులు, నమోదు చేసిన ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్ల ద్వారానే లోన్ కోరాలని సూచించారు. ఫేక్ ఎన్జీవో పేర్లు, పెద్ద పెద్ద హామీలతో చేసే కాల్స్ పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే స్పందించాలి. డయల్ 1930 లేదా ద్వారా ఫిర్యాదు చేయాలని అధికారుల పిలుపు. ఆలస్యమైతే డబ్బు ట్రేస్ చేసే అవకాశాలు తగ్గిపోతాయని తెలిపారు. ప్రజలు జాగ్రత్తగా ఉంటేనే ఈ తరహా మోసాలకు చెక్ పడుతుందని పోలీసులు స్పష్టం చేశారు.

# ఆంధ్రలో విజ్ఞాన దీపం

## - విశాఖలో గూగుల్ ఏఐ కేంద్రంతో కొత్త దిశ



డెస్క్ : ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో గూగుల్ ఆధ్వర్యంలో ఏఐ హబ్ ఏర్పాటు కావడం దేశ అభివృద్ధి యాత్రలో కీలక ఘట్టంగా నిలిచింది. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన వికసిత భారత దృష్టికి అనుగుణంగా గిగావాట్ స్థాయి డేటా సెంటర్ మౌలిక వసతులతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది. ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన సాంకేతిక ప్రజాస్వామ్యీకరణ లక్ష్యానికి ఈ హబ్ బలమైన వేదికగా మారనుందని కేంద్ర వర్గాలు భావిస్తున్నాయి. ఆధునిక కృత్రిమ మేధస్సు సాధనాలు ప్రతి పౌరుడి అందుబాటులోకి రావడానికి ఇది మార్గం సుగమం చేస్తుంది. డిజిటల్ ఆర్థిక వ్యవస్థను విస్తరించి, విశాఖను దేశ సాంకేతిక పటముపై ముందంజలో నిలపడానికి ఈ పెట్టుబడి దోహదం చేయనుంది. ప్రపంచ స్థాయి టెక్నాలజీ కేంద్రాల సరసన భారత స్థానం మరింత బలోపేతం అవుతుందనే నమ్మకం వ్యక్తమవుతోంది. దేశ ప్రతిభకు కొత్త అవకాశాలు, యువతకు నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలకు పెట్టుబడుల ఆకర్షణ ఇలా పలు మార్గాల్లో ఈ ఏఐ హబ్ ప్రభావం చాటనుందనే ఆశాభావం ఏర్పడింది. విశాఖపట్నం భౌగోళికంగా అనుకూలమైన నగరం కావడంతో పాటు, విద్యా రంగంలో కూడా బలమైన మౌలిక వసతులు కలిగి ఉంది. ఇక్కడ నుంచి పెద్ద సంఖ్యలో సాంకేతిక నిపుణులు ప్రపంచానికి చేరుకుంటున్న నేపథ్యంలో, ఈ ఏఐ హబ్ వారిలో మరింత నమ్మకం, అవకాశాలు కలిగించనుంది. స్థానిక ప్రతిభను ఉపయోగించుకోవడానికి సంస్థలు ముందుకు రావటం వలన ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. భవిష్యత్తు సాంకేతికతగా నిలుస్తున్న కృత్రిమ మేధస్సు రంగంలో భారత్ స్వావలంబన సాధించాలనే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పానికి ఇది మరో బలాన్నిస్తుంది. గ్రామీణ ప్రాంతాల వరకు సాంకేతిక సేవలు, డిజిటల్ పరిష్కారాలు చేరేలా చేయడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించగలదు. విజ్ఞానం, ఉపాధి, ఆవిష్కరణ ం ఈ మూడు దిశల్లో విశాఖ గూగుల్ ఏఐ హబ్ దేశానికి ప్రేరణగా నిలవనుంది.

# బీహార్ ఎన్నికల కట్టడం.. బీజేపీ తొలి జాబితా సంచలనం

డెస్క్ : బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేడి పెరుగుతున్న వేళ, బీజేపీ మొదటి దెబ్బ వేసింది. ఎన్డీఏ కూటమి సీట్ల సర్దుబాటు పూర్తికాగానే, మంగళవారం కమలం పార్టీ గర్జనలా 71 మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. మొదటి జాబితాలోనే కీలక నేతలు ఉండటం, ఎన్నికలకు బీజేపీ సీరియస్‌గా సిద్ధమవుతోందన్న సంకేతాలను ఇస్తోంది. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రులుగా ఉన్న సామ్రాట్ చౌదరి (తారాపూర్) మరియు విజయ్ కుమార్ సిన్హా (లఖిసరాయ్) మళ్లీ బరిలోకి దిగుతున్నారు. వీరితో పాటు మాజీ ఉప ముఖ్యమంత్రులు తార్కిషోర్ ప్రసాద్ (కతిహార్) మరియు రేణు దేవి (బెట్టియా)లకు కూడా టికెట్లు కేటాయించడం గమనార్హం. పార్టీ సీనియర్ నేతలపై నమ్మకం ఉంచిన బీజేపీ, మాజీ ఎంపీలు రామ్ కృపాల్ యాదవ్ (దానాపూర్) మరియు సునీల్ పింటూ (సీతామఢి)లను జాబితాలో చేర్చింది. 2024 లోక్‌సభలో సీట్ల సర్దుబాటు కారణంగా పింటూ పోటీ చేయలేకపోయినా, ఈసారి అసెంబ్లీ రేసులో అవకాశం ఇవ్వడం బ్యాలెన్స్ స్ట్రాటజీగా కనిపిస్తోంది. ఇక ప్రత్యేక ఆకర్షణగా మారింది – కొద్ది రోజుల క్రితం కాంగ్రెస్‌ను విడిచిపెట్టి బీజేపీలో చేరిన సిద్ధార్థ సౌరవ్‌కు బిక్రమ్ స్థానం నుంచి టికెట్. నితీశ్ కుమార్ ప్రభుత్వాన్ని కాపాడిన సమయంలో కీలక పాత్ర పోషించినందుకు ఈ అవకాశాన్ని పార్టీ గుర్తింపుగా భావిస్తున్నారు. అంతర్జాతీయ షూటర్ మరియు సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రేయసి సింగ్ (జమూయి), ఆరోగ్య శాఖ మంత్రి మంగళ్ పాండే (సివాన్), పరిశ్రమల శాఖ మంత్రి నితీశ్ మిశ్రా (ఝంఝార్‌పూర్) వంటి కీలక నేతలు కూడా ఈ జాబితాలో ఉన్నారు. అనుభవజ్ఞులైన నేతలతో పాటు కొత్త ముఖాలకు కూడా సమ ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా బీజేపీ సమతుల్య సమీకరణాన్ని అమలు చేస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# సంపాదకీయం

## మట్టిని ముద్దాడే చేతులు

- గ్రామీణ మహిళల గురించి మాట్లాడే రోజు
- అడుగులు నేలమీదైనా, ఆలోచనలు ఆకాశంలో ఎగరేవి
- గ్రామీణ మహిళ శక్తి

మన వ్యవసాయ భూములు పండ్లు ఇవ్వడానికి గింజలు మాత్రమే కాదు, చెమట చిందించే చేతులూ అవసరం. ఆ చేతుల్లో సగం వాటా గ్రామీణ మహిళలదే. పొలంలో విత్తనం వేయడం నుంచి పంటను ఇంటికి తీసుకురావడం వరకు ఆమె పాత్ర నిశ్శబ్దమైనా అమోఘమైనది. అయినప్పటికీ సమాజం చరిత్ర వ్రాయడం మొదలెడితే ఆమె పేరు వంకరపట్టీ కూడా రాస్తుండదు. అందుకే ప్రపంచ దేశాలు అక్టోబర్ పదిహేనును గ్రామీణ మహిళల దినోత్సవంగా గుర్తించి, నిశ్శబ్దంగా శ్రమిస్తున్న ఆ మహాశక్తికి గౌరవ వందనం అర్పిస్తున్నాయి. పల్లెలో పుట్టిన అమ్మాయి కళ్లలో ఆశలు ఉంటాయి కానీ వాటిని పలికించుకునే వేదికలు ఉండవు. ఇంటి పనులు, పశువుల సంరక్షణ, పొలాల్లో శ్రమ, కుటుంబ బాధ్యతలు ఇవన్నీ ఆమె నిత్యజీవితం. కానీ ఈ శ్రమకు పేరుండదు, గుర్తింపు ఉండదు, వేతనం ఉండదు. మరి ఆమె కృషి లేకుండా పంటలు పండటాయా? ఆహారం ఎలా సిద్ధమవుతుంది? మనం తిన్న ప్రతి ముక్క వెనుక ఆమెలోని శక్తి, ఓర్పు, నమ్మకం ఉన్నాయి. గ్రామీణ మహిళ అంటే బలహీనురాలు కాదు, అత్యంత బలమైన జీవనాధారం. వాతావరణ మార్పులు, ఎండలు, కరువులు, అప్పులు, ఇబ్బందులు ఇవన్నీ ఒక రైతు కుటుంబాన్ని కలవరపెడితే ముందుగా నిలబడేది అదే గ్రామీణ మహిళ. ఇల్లు నిలదొక్కుకోవాలంటే ముందుగా ఆమె శక్తిగా ఉండాలి. కానీ శ్రమిస్తున్న ఆమె చేతిలో నిర్ణయాధికారం ఉండదు. భూమి పత్రాల్లో పేరు ఉండదు. పంట అమ్మకం లో లాభం మీద హక్కు ఉండదు. కష్టానికి కేవలం బాధ్యత మాత్రమే ప్రదానం. ఇదే అసలైన వ్యథ. సమాజం ఆమెను కుటుంబానికి మూలం అని అంటూనే ఆ మూలానికి విలువ ఇవ్వడం మరిచిపోతుంది. గ్రామీణ మహిళ అడుగులు నేలని తాకినా ఆలోచనలు ఆకాశాన్ని తాకగలవు. పిల్లల చదువు, కుటుంబ భవిష్యత్, ఆరోగ్యం, గ్రామం అభివృద్ధి వంటి విషయాల్లో ముందుగా ఆలోచించేది ఆమెనే. అయితే ఆమెను కేవలం సహాయక శక్తిగా కాకుండా, నిర్ణయం తీసుకునే శక్తిగా గుర్తిస్తేనే గ్రామ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. ఆధునిక యుగంలో ట్రాక్టర్, యంత్రం, టెక్నాలజీ పంటను వేగంగా పండించగలవు కానీ పంట మీద ప్రేమను మాత్రం మహిళలే నింపగలరు.

కావున గ్రామీణ మహిళల దినోత్సవం అనేది కేవలం ఒక చిహ్నం కాదు. ఇది ఒక బాధ్యతను గుర్తుచేస్తుంది. పల్లెలో కష్టం చేసే ఆ మహిళకు పేరు ఇవ్వాలి, హక్కు ఇవ్వాలి, గౌరవం ఇవ్వాలి. ఆమె చెమటను కేవలం పని అని కాకుండా దేశ నిర్మాణంలో భాగమైన శక్తిగా చూడాలి. ఒక మహిళను గౌరవించడం అంటే ఒక కుటుంబాన్ని నిలబెట్టడం. ఒక కుటుంబం నిలబడితే ఒక గ్రామం నిలబడుతుంది. గ్రామం నిలబడితే దేశం బలపడుతుంది. మహిళ అంటే బలహీనురాలు కాదు. ఆమె ఒక కుటుంబానికి వెన్నెముక, సమాజానికి నాడి, రైతు జీవితానికి శ్వాస. ఆమెను గుర్తించే దినోత్సవం ఒక్కరోజే అయినా, ఆమె కృషిని గుర్తించే మన మనసుల దినోత్సవం ప్రతి రోజూ జరగాలి.

గ్రామీణ మహిళలు కేవలం ఇంటి బాధ్యతలు చూసే గృహిణులు మాత్రమే కాదు. వారు ప్రకృతితో మాట్లాడేవారు, మట్టితో సంభాషించేవారు. విత్తనం వేయడానికి ముందు నేలని స్పృశించే ఆ స్పర్శలో ఒక ప్రార్థన ఉంటుంది. పంట మొలకెత్తినప్పుడు ఆమె కళ్లలో కనిపించే ఆనందం తల్లి పిల్లను చూసే ముద్దు చూపు లాంటిది. పట్టణాల్లో జీవితం లెక్కల మీద నడిస్తే, పల్లెల్లో జీవితం భావోద్వేగాల మీద నడుస్తుంది. ఆ భావోద్వేగానికి హృదయమైనది మహిళే. అందుకే ఆర్థికాభివృద్ధి గణాంకాల్లో ఆమె పేరు లేకున్నా, జీవన గణాంకాల్లో ఆమె ప్రభావం మొదటి స్థానంలో ఉంటుంది. చాలా సార్లు ఆమె తాగని చాయ, తినని అన్నం, వేసుకోని బట్టలను మిగిలిన కుటుంబ సభ్యులకు కేటాయిస్తుంది. తన అవసరాల్ని చివరికి నెట్టేసి, కుటుంబాన్ని ముందుకు నెట్టే ఆమె మనసు ఒక పెద్ద రాజ్యానికి కూడా పునాది వేయగల శక్తి. ఈ దినోత్సవం ఒకరోజు మాత్రమే అయినా, అది ఒక పెద్ద ప్రశ్నను అడుగుతుంది ం గౌరవం చెప్పగలుగుతున్నాం, కానీ గౌరవం ఇవ్వగలుగుతున్నామా? గ్రామీణ మహిళ కేవలం సహనానికి ప్రతీక కాదు, మార్పుని మోసుకెళ్లే శక్తి. ఆమెకు విద్యా అవకాశాలు, ఆరోగ్య సదుపాయాలు, ఆర్థిక సాధికారత లభించినప్పుడు గ్రామ చరిత్ర మారుతుంది. ఆమెను ప్రోత్సహించడం అంటే కేవలం ఒక మహిళను కాదు, ఒక గ్రామ భవిష్యత్తును ప్రోత్సహించడం. నిజమైన పురోగతి పల్లెలో ప్రారంభమవుతుంది, ఆ పురోగతికి అడుగున నిలిచేది ఆ నడకలో అలసిపోని మహిళే. విత్తనం వేయడానికి ముందు నేలని స్పృశించే ఆ స్పర్శలో ఒక ప్రార్థన ఉంటుంది. పంట మొలకెత్తినప్పుడు ఆమె కళ్లలో కనిపించే ఆనందం తల్లి పిల్లను చూసే ముద్దు చూపు లాంటిది. పట్టణాల్లో జీవితం లెక్కల మీద నడిస్తే, పల్లెల్లో జీవితం భావోద్వేగాల మీద నడుస్తుంది. ఆ భావోద్వేగానికి హృదయమైనది మహిళే. అందుకే ఆర్థికాభివృద్ధి గణాంకాల్లో ఆమె పేరు లేకున్నా, జీవన గణాంకాల్లో ఆమె ప్రభావం మొదటి స్థానంలో ఉంటుంది. చాలా సార్లు ఆమె తాగని చాయ, తినని అన్నం, వేసుకోని బట్టలను మిగిలిన కుటుంబ సభ్యులకు కేటాయిస్తుంది. తన అవసరాల్ని చివరికి నెట్టేసి, కుటుంబాన్ని ముందుకు నెట్టే ఆమె మనసు ఒక పెద్ద రాజ్యానికి కూడా పునాది వేయగల శక్తి. ఈ దినోత్సవం ఒకరోజు మాత్రమే అయినా, అది ఒక పెద్ద ప్రశ్నను అడుగుతుంది. గౌరవం చెప్పగలుగుతున్నాం, కానీ గౌరవం ఇవ్వగలుగుతున్నామా? గ్రామీణ మహిళ కేవలం సహనానికి ప్రతీక కాదు, మార్పుని మోసుకెళ్లే శక్తి. ఆమెకు విద్యా అవకాశాలు, ఆరోగ్య సదుపాయాలు, ఆర్థిక సాధికారత లభించినప్పుడు గ్రామ చరిత్ర మారుతుంది. ఆమెను ప్రోత్సహించడం అంటే కేవలం ఒక మహిళను కాదు, ఒక గ్రామ భవిష్యత్తును ప్రోత్సహించడం. నిజమైన పురోగతి పల్లెలో ప్రారంభమవుతుంది, ఆ పురోగతికి అడుగున నిలిచేది ఆ నడకలో అలసిపోని మహిళే.

– విశ్లేషణ : మునిగాల రాజు పాత్రికేయులు,
(డిజైనర్ టెక్ గురు) 8897975262

# బూత్ స్థాయి సమన్వయం ప్రారంభం



ఇంటింటికి చేరి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఓటర్లతో నేరుగా మాట్లాడే విధానం విజయానికి దారితీస్తుందని నేతలు అన్నది. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత కార్యకర్తలదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, పింఛన్లు, విద్యా సాయం, మహిళా అభివృద్ధి చర్యలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడానికి పథకాల అమలు వివరాలు సులభంగా అర్థమయ్యే రీతిలో చెప్పే విధానంపై దృష్టి పెట్టాలని చెప్పారు.

**– జూబ్లీహిల్స్ అభివృద్ధిలో కాంగ్రెస్ పాత్ర**

హైదరాబాద్, జూబ్లీహిల్స్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకున్న చర్యలను ప్రజలకు గుర్తు చేయాలని నేతలు పిలుపునిచ్చారు. రోడ్లు, నీటి పారుదల, కాలువలు, విద్యుత్ మరియు పౌర సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలను ప్రస్తావిస్తూ ప్రజా అభిమతాన్ని పొందేలా ప్రచారం చేయాలని సూచించారు.

**– ప్రతి కార్యకర్త ఒక నాయకుడిలా పనిచేయాలి**

పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త నాయకత్వ భావనతో వ్యవహరించాలని, బూత్ స్థాయిలో మద్దతు వర్గాలను బలోపేతం చేయాలని నేతలు సూచించారు. ప్రజలతో నిత్యం సంబంధం కొనసాగిస్తూ కాంగ్రెస్ పట్ల విశ్వాసం పెంచాలని సూచించారు. స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం పార్టీ తరపున చర్యలు తీసుకుంటామని ప్రజలకు నమ్మకం కల్పించాలని అన్నారు. పార్టీలో యువ కార్మికులు, మహిళలు మరింత చురుకుగా ముందుకు రావాలని నేతలు ప్రోత్సహించారు. బూత్ స్థాయిలో మహిళల భాగస్వామ్యంతోనే నిజమైన పార్టీ బలోపేతం సాధ్యమని అభిప్రాయపడ్డారు. స్థానిక మహిళా సంఘాలతో సంభాషణలు పెంచి, వారికి కాంగ్రెస్ కార్యాచరణను చేరవేయాలని తెలిపారు. ఈసారీ జూబ్లీహిల్స్ విజయం బోరబండ నుంచే ప్రారంభం కావాలని నేతలు ఆత్మవిశ్వాసంతో ప్రకటించారు. ప్రతి బూత్ సమావేశం ఒక శక్తివంతమైన మద్దతు వేదికగా మారాలని, గెలుపు కోసం కార్యాచరణ వేగాన్ని పెంచాలని సూచించారు. కార్యకర్తల ఉత్సాహం చూస్తే కాంగ్రెస్ విజయం ఖాయమని నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు గెలుపు కట్టబెట్టే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. బూత్ వారీగా ప్రత్యేక బృందాలను నియమించి ప్రచారాన్ని విస్తరించాలని ప్రకటించారు. అభ్యర్థి గెలుపు వ్యక్తిగతం కాదని, అది ప్రజల అభిమతం ప్రతిబింబిస్తుందని నేతలు చెప్పారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు వేడెక్కుతున్న వాతావరణం

ప్రకటించిన తర్వాత జూబ్లీహిల్స్‌లో ప్రచార బాట మొదలైంది. యువతను ఆకట్టుకునేలా నవీన్ వ్యూహరచనలో నిమగ్నమయ్యారు. బీజేపీ ఇంకా తన అభ్యర్థి పేరును ప్రకటించలేదు. త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మూడు పార్టీల మధ్య త్రికోణ పోటీ ఆసక్తిని రేపుతోంది.

జూబ్లీహిల్స్‌లో నవంబర్ 11న పోలింగ్ జరగనుండగా నవంబర్ 14న ఓట్ల లెక్కింపు జరగనుంది. ప్రస్తుత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో ఈ ఉప ఎన్నిక తప్పనిసరి అయింది. స్థానికంగా సానుభూతి వాతావరణం ఉన్నా రాజకీయ సమీకరణలు ఎలా మలుపు తిరుగుతాయో చూడాలి.

మాగంటి సునీత తన ప్రచారాన్ని త్వరలోనే ప్రారంభించనున్నారు. కేసీఆర్ నుండి లభించిన ప్రత్యక్ష బలం బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్తేజాన్ని నింపింది. ఇక కాంగ్రెస్, బీజేపీ ప్రచార రంగంలో ఎలాంటి ప్రయత్నాలు చేస్తాయో ఆసక్తిగా మారింది.

# ములుగు ప్రాజెక్టులపై వేగవంత చర్యలకు ఆదేశాలు

వేగవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. గోదావరి రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ఎక్కువ కాలంగా నిలిచిపోవడం వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి సీతక్క సమీక్షలో వివరించారు. వరదల సమయంలో గ్రామాలు రక్షితంగా ఉండేందుకు ఈ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రాజెక్ట్ పనులను ఆలస్యంలేకుండా ముందుకు తీసుకెళ్లేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి స్పష్టంగా ఆదేశించారు. ప్రభుత్వ ప్రయోజనకర పథకాలు భూమిపై కనిపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ములుగు జిల్లాలో పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్ట్ లను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. అవసరమైతే ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేసి అయినా పనులు పూర్తి చేయాలని చెప్పారు.


ఇజినీరింగ్ అధికారులు అన్ని ప్రాజెక్టులపై గ్రామాల వారీగా నివేదికలు తయారు చేసి సమర్పించాలని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సూచించారు. ఏ పనిలో ఎక్కడ నిలిచిపోయిందో స్పష్టమైన అంచనా ఇవ్వాలని చెప్పారు. మంత్రులు సీతక్క మరియు ఉత్తంకుమార్ రెడ్డి ఇద్దరూ కలిసి పనుల ప్రగతిని సమీక్షించడంపై అధికారులు స్పందన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలకు నీటి సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ సమావేశం ద్వారా ములుగు జిల్లాలో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులపై స్పష్టమైన కార్యాచరణ దిశ వెల్లడైంది. ప్రభుత్వ సంకల్పం ప్రాజెక్టు పనుల ద్వారా గ్రామస్థాయికి చేరేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.




# పెన్షన్ కోసం క్యూలో నిలిచిన గౌరవం

**- పిల్లలను పెంచిన చేతులు ఇప్పుడు ఖాళీగా.. - డబ్బు కాదు.. గుర్తింపు కావాలి - వృద్ధుల ఎదుట మనవత్వం పరీక్షకు వస్తోంది**



డెస్క్ : జీవితమంతా పిల్లల కోసం కష్టపడి, చెమటలు చిందించి, స్వంత కోరికలను త్యాగం చేసి కుటుంబాన్ని నిలబెట్టిన చేతులు ఇప్పుడు ఒక చిన్న పెన్షన్ కోసం ప్రభుత్వ ఆఫీసుల గుమ్మం వద్ద వేచి కూర్చోవడం ఎంత విచారకరం. వృద్ధాప్యంలో శరీర బలహీనమవుతుంది, కానీ గుండెలో మిగిలే బాధ మాత్రం ఇంకా లోతుగా గుచ్చుకుంటుంది. "మన పిల్లల్ని చదివించాం, పెళ్లి చేసాం, ఉద్యోగాలు పెట్టాం కానీ ఇప్పుడు మనల్ని చూసే కళ్లూ, పట్టే చెయ్యి లేదు" అని నిట్టూర్పు విడిచే వృద్ధుల మాటల్లో ఒక మౌన వేదన ఉంటుంది. ఆ వేదనను వినడానికి సమాజం దగ్గర సమయం లేదు. పిల్లలను పెంచడం తల్లిదండ్రుల బాధ్యత అయితే, పెద్దలైన పిల్లలు వారిని ఆదరించడం ఒక నీతి. కానీ ఈ నీతి ఇప్పుడు ఒక పాత కథలా మారిపోతోంది. వృద్ధులు పెన్షన్ కోసం క్యూలో నిలబడితే ఆ క్షణంలో గౌరవానికి బదులుగా ఒక రకం అవమానం ఎదురవుతుంది. ఒకప్పుడు పిల్లలకు బట్టల కోసం పాత చీర అమ్మిన తల్లి, ఈరోజు పెన్షన్ పొందడానికి లంచం ఇవ్వాల్సిన పరిస్థితి ఎదుర్కొంటోంది. జీవితాంతం అందించిన ప్రేమకు ప్రతిగా ప్రభుత్వ సర్టిఫికెట్ కోసం వేచిచూడాల్సిన దుస్థితి మన సమాజపు అసలు ప్రతిబింబం. పిల్లలు ఎదగడం గొప్ప విషయం. చదువు, ఉద్యోగం, స్థిరపడిన జీవితం.. ఇవన్నీ తల్లిదండ్రులే కోరుకున్న కలలు. కానీ ఆ కలలు సాకారమైన తర్వాత మూలాలను మరచిపోవడం మాత్రం క్షమించలేని వైఫల్యం. "డబ్బు పంపుతున్నాం కదా, ఇంకేం కావాలి?" అని కొంతమంది ప్రశ్నిస్తారు. కానీ వృద్ధాప్యంలో కావలసింది డబ్బు కాదు ఒంటరితనం పోవడం. పండగ రోజు ఇంటికి రావడం, ఒక కప్పు చాయిపెట్టి మాట్లాడే మాట, "ఎలా ఉన్నావు?" అని అడిగే ఆప్యాయత ఇవే వారికి పెన్షన్ కంటే విలువైనవి. పెన్షన్ వ్యవస్థ కేవలం పథకం కాదు, మానవత్వానికి పరీక్ష. వృద్ధుల దరఖాస్తులు అధికారుల టేబుల్‌పై నెలల తరబడి పేరుకుపోతే అది పరిపాలనలో వైఫల్యం మాత్రమే కాదు, మన సమాజపు మనసు ఎండిపోయిందనే సంకేతం. ఒకప్పుడు అడుగు వేస్తే పిల్లలు పరిగెత్తి వచ్చి పట్టుకునే తల్లిదండ్రులు, ఈరోజు తమ పేరును పిలుస్తారనే ఆశతో మొబైల్ స్క్రీన్‌నే చూస్తున్నారు. ఆ స్క్రీన్ వెలగకపోతే వారి గుండెల్లో అంధకారం మరింతగా పెరుగుతోంది. వారికి ముఖ్యమైనది పెన్షన్ అందుతుందా అనే కాదు.. ఇంకా ఎవరికైనా తాము గుర్తున్నామా? తమ జీవితం విలువైనదేనా? త్యాగాలు గుర్తింపునకు అర్హమైనవేనా? అనే ఆత్మప్రశ్నలకు సమాధానం కావాలి. గౌరవం ఇళ్లలోనే మొదలవుతుంది. ఒక మాటతోనే వృద్ధుల గుండెల్లో వెలుగు రగులుతుంది. వారితో కూర్చొని మాట్లాడే కొన్ని క్షణాలు, జీవితాంతం వారికి బలం అవుతాయి. మన చేత సరిపోయిన ప్రేమ లేకపోతే ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ ఎంత వచ్చినా ఆ ఒంటరితనం తీర్చలేం. పిల్లలను పెంచిన చేతులు ఇప్పుడు వణుకుతున్నాయి. ఆ చేతులు ఒకప్పుడు మన భవిష్యత్తు కోసం అన్నీ వదిలాయి. ఇప్పుడు మనమి పెట్టాల్సింది కేవలం ఓ స్నేహపూర్వక చేయి మాత్రమే. పెన్షన్ కోసం ఎదురు చూస్తున్న ఆ వృద్ధులు చివరికి డబ్బు కోసం కాదు మనసు కోసం, గుర్తింపుకోసం, "మీరు ఇంకా మా జీవితాల్లో అవసరమైనవారు" అని ఒక మాట కోసం ఎదురుచూస్తున్నారు.

**– విశ్లేషణ : మునిగాల రాజు పాత్రికేయులు,
(డిజైనర్ టెక్ గురు) 8897975262**



# పెదవి విప్పిన దీపిక



అయితే ఈ రెండు ప్రాజెక్ట్స్ నుంచి తప్పుకోవడానికి గల కారణాలు తెలియరాలేదు. కానీ సోషల్ మీడియాలో మాత్రం అనేక రూమర్స్ హల్చల్ అయ్యాయి. దీపికా కేవలం 8 గంటలు మాత్రమే పనిచేస్తానని చెప్పడం.. అలాగే అధికంగా రెమ్యునరేషన్ అడిగిందనే ప్రచారం నడించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో దీపికా ఈ విషయంపై స్పందించింది. వర్కింగ్ అవర్స్ కారణంగా ఆమె భారీ ప్రాజెక్ట్స్ నుంచి తప్పుకున్నారనే వార్తలపై ఆమె పరోక్షంగా స్పందించింది. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దీపికా మాట్లాడింది.”ఒక మహిళ కావడం.. అది కూడా ఒత్తిడి కలిగించేది.. మరేదైనా అనిపిస్తే అలాగే ఉండకండి. ఒక నటిగా నాకు ఇబ్బంది అనిపిస్తే నేను అంగీకరించను. భారతీయ సినిమా పరిశ్రమలో చాలా మంది సూపర్ స్టార్స్, హీరోలు ఎన్నో సంవత్సరాలుగా 8 గంటలు మాత్రమే పనిచేస్తున్నారు. ఈ విషయం రహస్యం ఏమి కాదు. కానీ అది ఎప్పుడూ వార్తల్లోకి రాలేదు. నేను ఇప్పుడు వారి పేర్లు చెప్పి ఈ విషయాన్ని మార్చాలని అనుకోవడం లేదు. కానీ చాలా మంది హీరోలు రోజుకు 8 గంటలు మాత్రమే పనిచేస్తున్నారనేది అందరికీ తెలిసిన విషయమే. సోమవారం నుంచి శు క్రవారం వరకు రోజూ ఎనిమిది గంటలు మాత్రమే వర్క్ చేస్తారు. వీకెండ్స్ లో అసలు పనిచేయరు.” అంటూ చెప్పుకొచ్చింది దీపిక. అలాగే.. న్యాయంగా పోరాటం చేస్తున్న కారణంగా మీరు ఇబ్బందిపడ్డారా.. అని అడగ్గా.. దీపికా మాట్లాడుతూ.. “ఇది కొత్తేం కాదు. చాలాసార్లు ఇలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నాను. దీని గురించి ఎలా చెప్పాలనేది నాకు తెలియడం లేదు. ఎన్నో పోరాటాలను నిశ్శబ్దంగానే ఎదుర్కొన్నాను. కానీ కొన్ని కారణాలతో అవి బయటకు వస్తుంటాయి. నేను ఎప్పుడూ వాటిపై స్పందించను. సైలెంట్ గా యుద్ధాలను చేయడం మాత్రమే నాకు తెలుసు. అలా చేస్తేనే గౌరవంగా ఉంటుంది” అంటు చెప్పుకొచ్చారు. ఇటీవలే స్పిరిట్, కల్కి 2 ప్రాజెక్ట్స్ నుంచి తప్పుకుంది. ప్రస్తుతం ఆమె షారుఖ్ ఖాన్, సిద్ధార్థ్ ఆనంద్ కాంబోలో రాబోతున్న చిత్రంలో నటిస్తుంది. అలాగే అల్లు అర్జున్, అట్లీ సినిమాలో నటిస్తుంది.

# ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారిన... బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ!

భారీ అంచనాలతో విడుదలైన వార్ 2 సినిమా బాక్సాఫీస్ వద్ద దారుణంగా విఫలమవడంతో, కియారాకు భవిష్యత్ ప్రాజెక్టుల విషయంలో అనేక అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నట్లు సమాచారం. హృతిక్ రోషన్ ఎన్టీఆర్ మల్టీస్టారర్ గా తెరకెక్కిన వార్ 2 చిత్రం ఆగస్టు 14న గ్రాండ్‌గా విడుదలై మొదటి వీకెండ్ వరకూ చక్కటి కలెక్షన్లను రాబట్టింది. అయితే ఆ తర్వాత కలెక్షన్స్ డ్రాప్ కావడంతో భారీ నష్టాలు మిగిలాయి. ఇదే సమయంలో ఎన్టీఆర్ బాలీవుడ్ ఎంట్రీ చిత్రం డిజాస్టర్ కావడంతో అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది. వార్ 2 విఫలమైన తర్వాత స్పై యూనివర్స్ ప్రాజెక్టులపై మళ్లీ వ్యూహాలు పునః సమీక్షించబడుతున్నాయని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. కియారా అద్వానీతో వైఆర్ఎఫ్ మూడు సినిమాల డీల్ చేసినట్లు సమాచారం. స్పై యూనివర్స్ లో ప్రధాన మహిళా పాత్రల కోసం ఆమెను ఎంపిక చేసినప్పటికీ, తాజా ఫలితంతో ఆ కాంట్రాక్ట్ రద్దు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. వార్ 2 చిత్రంలో కియారా తన గ్లామర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. కెరీర్‌లో తొలిసారి బికినీ లుక్ లో కనిపించారు. కానీ కథా బలం లేకపోవడంతో ప్రేక్షకులను ఇంప్రెస్ చేయడంలో సినిమా విఫలమైంది. ఫలితంగా కియారాపై విమర్శలు వెల్లువెత్తాయి. ఇటీవల తల్లి అయిన కియారా, ప్రస్తుతం మేటర్నిటీ బ్రేక్ తీసుకున్నారు. ఈ కారణంగా కూడా ఆమె కొత్త సినిమాలకు కొంత విరామం ఇచ్చారు. ఇండస్ట్రీలో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, వైఆర్ఎఫ్ సంస్థ స్పై యూనివర్స్‌లో తదుపరి ప్రాజెక్టులకు కొత్త భామలని ఎంపిక చేయాలని చూస్తుందనే టాక్ వినిపిస్తుంది. వార్ 2 పరాజయం తర్వాత బాలీవుడ్ లో హై బడ్జెట్ యాక్షన్ సినిమాలపై మరోసారి సమీక్ష ప్రారంభమైందని తెలుస్తోంది. ప్రేక్షకులు కొత్త కథలు, లోతైన భావోద్వేగాలు కోరుకుంటున్నారు అని నిర్మాతలు విశ్లేషిస్తున్నారు. తారల గ్లామర్ మాత్రమే కాదు, కథకు బలం అవసరం అనే విషయాన్ని ఈ ఫలితం మళ్లీ రుజువు చేసింది. మరి వార్ 2 ఫెయిల్యూర్ కియారాకు ఎంత వరకూ ఇబ్బంది కలిగిస్తుందో వేచి చూడాల్సిందే. అధికారికంగా కాంట్రాక్ట్ గురించి ఎలాంటి ప్రకటన చేయనప్పటికీ, బాలీవుడ్ బిజినెస్ వర్గాల్లో గుసగుసలు ఊపందుకున్నాయి.



# కాంతారా 1 తర్వాత ట్రెండింగ్‌లో రుక్మిణి వసంత్

కన్నడ సినిమా కాంతారా చాప్టర్ 1 తో దేశవ్యాప్తంగా పాపులారిటీ తెచ్చుకున్న అందాల ముద్దుగుమ్మ రుక్మిణి వసంత్. ఈ అమ్మడు రీసెంట్ ఇంటర్వ్యూలో తన కెరీర్, వ్యక్తిగత అభిరుచుల గురించి షాక్ అయ్యే విషయాలు వెల్లడించారు. సినిమాలో కనకావతి పాత్రలో ఆమె చూపించిన పవర్, సౌత ఆడియన్స్‌కి తెగ నచ్చేసింది. కాంతారా2 తర్వాత రుక్మిణి మరింత ట్రెండింగ్‌లోకి వచ్చింది. అయితే తాజాగా రుక్మిణి మాట్లాడుతూ, నటిగా మారడానికి ముందు మోడలింగ్ చేశానని, అది చూసే నాకు మొదటి సినిమా ఆఫర్ వచ్చింది అని వెల్లడించారు. సప్త సాగరాల దాటి డైరెక్టర్‌కి ఆడిషన్ కోసం మెసేజ్ పంపించాను . అది చూసి ఆడిషన్‌కు పిలిచారు. ఆ మెసేజ్ చూడకపోయి ఉంటే ఆ అవకాశం రావడం ఎంత కష్టమవుతుందో నాకు తెలుసు. ఆ సినిమా తర్వాత చాలా ఆఫర్లు వచ్చాయి అని ఆమె తెలిపారు. అలాగే, సినిమాల్లోకి అడుగు పెట్టాలనే కోరికతో లండన్‌లో థియేటర్ ఆర్ట్స్ చదివినట్లు చెప్పింది. వ్యక్తిగత జీవితంపై రుక్మిణి మాట్లాడుతూ, తండ్రి ఆర్మీలో ప్రాణాలు కోల్పోయిన తర్వాత, చెల్లి కోసం అన్నీ దగ్గర ఉండి చూసారని చెప్పారు. ఆమెకు బుక్‌లు చదవడం అంటే చాలా ఇష్టం . ఎక్కడా షూటింగ్ జరుగుతున్నా దగ్గరలో లైబ్రరీ ఉందా అని వెతకడం, అక్కడకు వెళ్లి చదవడం ద్వారా క్యారెక్టర్స్ లో ఎలా నటించాలో అర్థం చేసుకుంటుందని చెప్పారు. కాంతారా 1 తర్వాత రుక్మిణి పాన్ ఇండియా ఆఫర్లను అందుకుంటున్నారు. సోషల్ మీడియా ఫాలోయింగ్ కూడా విశేషంగా పెరిగింది. ఈ విజయంతో ఆమె భవిష్యత్తులో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగే అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తోంది. రుక్మిణి వసంత్ ..ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబో సినిమాలో అవకాశం పొందారు. ఈ సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులని పలకరించడమే కాకుండా పాన్ ఇండియా లెవల్‌లో టాప్ రేంజ్ హీరోయిన్‌గా పరిచయం అవుతారని విశ్లేషకులు చెబుతున్నారు. గతంలో నిఖిల్‌తో స్ట్రైట్ మూవీ చేసిన కూడా, ఇప్పుడు ఎన్టీఆర్ సినిమాతోనే ఆమె టాలీవుడ్ ప్రేక్షకులకి మరింత దగ్గర అవుతుందని అంటున్నారు. రుక్మిణి భవిష్యత్తులో సౌత్ ఇండస్ట్రీలో ప్రముఖ హీరోయిన్‌గా నిలవనుందని ఆమె ఫ్యాన్స్ భావిస్తున్నారు.





# నక్సలైట్‌గా ఆనంద్‌దేవరకొండ..

బేబి సినిమాతో సూపర్ హిట్టు కొట్టాడు ఆనంద్‌దేవరకొండ. ఆ తర్వాత వినోద్ అనంతోజ్ డైరెక్షన్‌లో నటించిన మిడిల్ క్లాస్ మెలోడీస్ బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ తెచ్చుకుంది. వినోద్ అనంతోజ్, ఆనంద్ దేవరకొండ కాంబోలో మరో సినిమా రాబోతుంది. ఈ ఇద్దరూ ఈ సారి విభిన్న కథాంశంతో వస్తున్నట్టు తాజాగా రిలీజ్ చేసిన పోస్టర్ చెబుతోంది. ఆనంద్ దేవరకొండ నటిస్తున్న నెట్‌ఫ్లిక్స్ ఒరిజినల్ ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ టైటిల్, ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఇందులో ఆనంద్ దేవరకొండ నక్సలైట్‌గా కనిపించబోతున్నట్టు క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్. వేటగాడి చరిత్రలో జింకలు దోషులు.. అనే క్యాప్షన్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీలో లాపతా లేడీస్ ఫేం నటాన్షి గోయెల్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రీమియర్ డేట్‌తోపాటు ఇతర వివరాలపై రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనుంది ఆనంద్ దేవరకొండ టీం. తిరుగుబాటు ప్రతీకార డ్రామా నేపథ్యంలో వచ్చే ఈ చిత్రంపై ఫస్ట్ లుక్‌తో అంచనాలు పెరిగిపోతున్నాయి.

# డార్లింగ్ పెళ్లి కోసం వెయిట్ చేస్తున్నారా? అయితే అనుష్క మూవీ చూడాల్సిందే!



అనుష్క శెట్టి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఇక చాలా రోజుల నుంచి ఈ అమ్మడు చిత్రపరిశ్రమకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. కాగా చాలా గ్యాప్ తర్వాత ఈ బ్యూటీ ఘాటీ సినిమాతో తన అభిమానుల ముందుకు రానుంది. మరీ ఈ మూవీ ముచ్చట్లు కొన్ని తెలుసుకుందాం పదండి!

సీతమ్మోరు లంకా దహనం చేస్తే ఎలా ఉంటుందో చూడాలనుకుంటున్నారా? డార్లింగ్ పెళ్లి కోసం వెయిట్ చేస్తున్నారా? ఈ రెండు ప్రశ్నలకి ఒకటే జవాబు ఘాటి ట్రైలర్ చూస్తే అర్థమైపోతుంది.. అనుష్క నటించిన ఘాటిలో ఇంతకీ ఏం ఉంది? గ్లామర్ కత్తి పట్టి రపరపలాడిస్తే.. సిల్వర్ స్క్రీన్ మీద నెత్తురోడిస్తే.. విక్టిమ్ క్రిమినల్‌గా మారి లెజెండ్‌గా కనిపిస్తే.. అన్నిటికీ ఒకటే ఆన్సర్ ఘాటి. అనుష్క హీరోయిన్‌గా నటించిన ఘాటి ట్రైలర్ వచ్చేసింది. అనుష్కతో వేదంలాంటి సినిమా చేసిన క్రిష్ జాగర్లమూడి ఈ సారి ఘాటిలో ఏం చెప్పదలచుకున్నారు? చెప్పదలచుకున్న విషయాన్ని మూసిపెట్టి, దాచిపెట్టి ఎందుకు చెప్పడం? ఇదీ కథ అని చెప్పేస్తే పోతుంది కదా అని అనుకున్నట్టున్నారు క్రిష్. ఘాటీ గురించి ఘాటీల ఇబ్బందుల గురించి, ఘాటీ లెజెండ్‌గా మారిన విషయం గురించి, ఎదుర్కొన్న అన్యాయాల గురించి, వాళ్ల జీవితాల్లో కష్టసుఖాల గురించి ట్రైలర్‌లో పూసగుచ్చినట్టు చెప్పేశారు. పనిలో పనిగా సెప్టెంబర్ 5న వచ్చేస్తున్నామంటూ రిలీజ్ డేట్ కూడా ఇచ్చేశారు మేకర్స్. డార్లింగ్ పెళ్లెప్పుడు? అని అంటే.. వెయిటింగ్ అనే డైలాగ్ ట్రైలర్‌లో ఎక్స్ ట్రా అట్రాక్షన్‌గా ఉంది. స్వీటీ సినిమా కోసం చాన్నాళ్లుగా వెయిట్ చేస్తున్న ఫ్యాన్స్ మాత్రం ఆమె స్క్రీన్ ప్రెజెన్స్ కీ, లుక్స్ కీ, పెర్ఫార్మెన్స్ కీ ఫిదా అవుతున్నారు. సినిమా బ్లాక్ బస్టర్ ఖాయం అంటూ ఆనందపడిపోతున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073